క్లుప్తంగా

ఉత్సాహంగా ఫ్రెషర్స్ డే

పొదలకూరు : పట్టణంలోని విజ్ఞాన్ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరంలో చేరిన విద్యార్థులను ఆహ్వానిస్తూ ద్వితీయ సంవత్సర విద్యార్థులు ఫ్రెషర్స్ డేను శనివారం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రసాద్, ఎస్సై డి.రామకృష్ణ, టీటీడీ విజిలెన్స్ రిటైర్డ్ డీఎస్పీ ప్రభాకర్‌గౌడ్ హాజరయ్యారు.

గంజాయిని రవాణాను అడ్డుకుందాం

• ఎస్సై రామకృష్ణ



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సై రామకృష్ణ

పొదలకూరు : ప్రమాదకరమైన గంజాయి రవాణాను అడ్డుకోవడంలో విద్యార్థులు ముందుండాలని ఎస్సై డి.రామకృష్ణ తెలియజేశారు. స్థానిక కల్యాణ మండపంలో విజ్ఞాన్ జూనియర్ కాలేజీ విద్యార్థులకు యాంటీ ర్యాగింగ్, మాదకద్రవ్యాల నిర్మూలనపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఎస్సై శనివారం పాల్గొన్నారు. యువత, విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. సమావేశంలో సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రసాద్ విద్యార్థులకు మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. కళాశాల కరస్పాండెంట్ సుధాకర్‌రెడ్డి, డైరెక్టర్లు సుబ్బారెడ్డి, ఎన్వీ రెడ్డి, భాస్కర్‌రెడ్డి, ప్రిన్సిపల్ సుబ్బారావు, టీటీడీ విజిలెన్స్ డీఎస్పీ ప్రభాకర్‌గౌడ్, వైస్ ప్రిన్సిపల్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

గండిపాళెం జలాశయం గేట్ల పరిశీలన

ఉదయగిరి: గండిపాళెం జలాశయం క్రస్ట్ గేట్లను ఇరిగేషన్ అధికారులు శనివారం పరిశీలించారు. గేట్లు మరమ్మతులకు గురై కొంతమేర నీరు లీకేజీ జరుగుతోంది. ఈ నేపథ్యంలో గేట్ల మరమ్మతులకు ఉన్న అవకాశాలను పరిశీలించినట్లు డీఈ చంద్రమౌళి తెలిపారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో నీరు లీకేజీ కాకుండా ఉండేందుకు త్వరలో మరమ్మతులు చేయిస్తామని చెప్పారు. ఆయన వెంట ఏఈలు సురేష్,వేణు ,సిబ్బంది ఉన్నారు.

తక్కువ ధరకే బియ్యం, కందిపప్పు విక్రయం

ఆత్మకూరు: ప్రభుత్వ ఆదేశాల మేరకు పట్టణంలోని ఆర్టీసీ డిపో ఎదురు వీధిలో ఉన్న సింహాద్రి మెగామార్ట్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్ ద్వారా ప్రజలకు తక్కువ ధరకు బియ్యం, కందిపప్పును ఆదివారం నుంచి అందించనున్నట్లు ఆత్మకూరు ఆర్డీఓ మధులత శనివారం తెలిపారు. మార్కెట్లో కిలో కందిపప్పు రూ.181 ఉండగా, ప్రత్యేక కౌంటర్‌లో రూ.160కు అందజేస్తున్నట్లు చెప్పారు. మార్కెట్లో నాణ్యమైన సన్న బియ్యం రూ.55 ఉండగా, ప్రత్యేక కౌంటర్‌లో రూ.49కు అందజేస్తున్నామని తెలిపారు. మార్కెట్లో ముడి బియ్యం రూ.52.40 ఉండగా, రూ.48కు అందజేస్తున్నట్లు వివరించారు.

సేవకు సలామ్

• పారిశుద్ధ్య కార్మికులే అసలైన సేవకులు
• బారాషహీద్ దర్గా ప్రాంగణంలో శ్రమిస్తున్న 5,885 మంది
• మూడు షిఫ్టుల్లో విధులు



దర్గా ప్రాంగణంలో పరిసరాలు శుభ్రం చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

నెల్లూరు(బారకాసు): పరిసరాల పరిశుభ్రత, ప్రజారోగ్యమే ధ్యేయంగా పారిశుద్ధ్య కార్మికులు అందిస్తున్న సేవలకు పలువురు సలామ్ చేస్తున్నారు. నెల్లూరు నగరంలోని బారాషహీద్ దర్గా ప్రాంగణంలో ఈ నెల 17 నుంచి 21వ తేదీ వరకు జరుగుతున్న రొట్టెల పండగకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా పారిశుద్ధ్య కార్మికులు పనిచేస్తున్నారు. దర్గా ప్రాంగణంలో చెత్తాచెదారాన్ని ఎప్పటికప్పుడు తొలగించేలా మొత్తం 5,885 మంది కార్మికులను నియమించారు. వీరంతా మూడు షిఫ్టులలో పనిచేస్తున్నారు. ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఒక షిఫ్ట్.. మధ్యాహ్నం 2 నుంచి రాత్రి 10 గంటల వరకు రెండో షిఫ్ట్.. రాత్రి 10 నుంచి ఉదయం 6 గంటల వరకు మూడో షిఫ్ట్.. ఇలా ఒక్కో షిఫ్ట్‌లో 1,961 మంది పారిశుద్ధ్య కార్మికులు సేవలందిస్తున్నారు. వీరంతా దర్గా ప్రాంగణంలో ఖాళీ వాటర్ ప్యాకెట్లు, బాటిళ్లు, కాగితాలు, చెత్తాచెదారం కనిపించగానే వెంటనే తొలగిస్తున్నారు. ఆ చెత్తను మినీ ఆటోలు, ట్రాక్టర్లలో వేసి అక్కడి నుంచి డంపింగ్ యార్డుకు తరలిస్తున్నారు. అలాగే స్వర్ణాలచెరువులో భక్తులు రొట్టెలు మార్చుకునే సందర్భంలో నీటిలో చెత్తాచెదారం లేకుండా ప్రత్యేక నెట్‌లతో తొలగిస్తున్నారు. మరుగుదొడ్లను పరిశుభ్రంగా ఉంచేలా పనిచేస్తున్నారు. వ్యర్థాలను సెప్టిక్ ట్యాంక్‌ల ద్వారా తరలిస్తున్నారు. స్నానపు గదులు, సామూహిక మరుగుదొడ్లు, ఘాట్ తదితర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉండేలా సేవలందిస్తున్నారు. ఈ ప్రక్రియను నగర పాలక సంస్థకు సంబంధించిన అధికారులు పర్యవేక్షిస్తున్నారు.



స్వర్ణాల చెరువులో చెత్తను తొలగిస్తున్న పారిశుద్ధ్య కార్మికుడు

భక్తులకు అసౌకర్యం కలగకుండా చేస్తున్నాం



రొట్టెల పండుగలో తమ వంతుగా పారిశుద్ధ్య పనులు చేపట్టడం ఎంతగానో సంతోషిస్తున్నా. దేవుడికి సేవ చేస్తున్నట్టుగా భావిస్తున్నా. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకూడదనే తమ కార్మికులంతా నిత్యం పనిచేస్తున్నాం.

– శ్రీలక్ష్మి, పారిశుద్ధ్య కార్మికురాలు

ఈ సేవ చేయడం అదృష్టం



దర్గా ప్రాంగణంలో భక్తులకు సేవ చేసే అవకాశం లభించడం అదృష్టంగా భావిస్తున్నా. దర్గా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం, పారిశుద్ధ్యం పరంగా భక్తులకు ఇబ్బందులు లేకుండా చేయడమే లక్ష్యంగా మేము పనిచేస్తున్నాం.

– ఏడుకొండలు, పారిశుధ్య కార్మికుడు

గురుపూర్ణిమ ఉత్సవాలు ఘనంగా ప్రారంభం



శ్రీసాయిదర్బార్‌లో పూజలు చేస్తున్న అర్చకులు

• శ్రీసాయిదర్బార్ అద్దాల మందిరంలో ప్రత్యేక పూజలు

నెల్లూరు(బృందావనం): బాలాజీనగర్ ప్రాంతంలోని పద్మావతినగర్‌లో ఉన్న శ్రీసాయిదర్బార్ అద్దాల మందిరంలో గురుపూర్ణిమ ఉత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాల సందర్భంగా ఉదయం ఏసీనగర్‌లోని కోదండరామస్వామి ఆలయంలో సీతారాములను ప్రత్యేకంగా అలంకరించి శ్రీసాయిదర్బార్‌కు ఉత్సవంగా తీసుకువచ్చారు. అనంతరం సంప్రదాయబద్ధంగా గురుపూర్ణిమ ఉత్సవాలను ప్రారంభించారు. విష్వక్సేనపూజ, కలశస్థాపన, నవగ్రహ మండపారాధన, సీతారాములకు విశేష పూజలు, భజనలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. కురిచేటి లక్ష్మీనారాయణరావు, వెంకటనాగమణి, తాళ్లూరి గోపాలనాయుడు, శిరీష దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమాలను శ్రీసాయిదర్బార్ అద్దాల మందిరం మేనేజింగ్ ట్రస్టీ మధుసాయి, గౌరవ సలహాదారులు పాబోలు రామసుబ్బయ్య, శ్రీసాయిదర్బార్ సత్సంగ్ సేవాదళ్ సభ్యులు పర్యవేక్షించారు.

జ్యోతి కుటుంబసభ్యులకు పరామర్శ



నెల్లూరు(అర్బన్): జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో సుదీర్ఘకాలం పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన హంస సభ్యురాలు డీఎంజే జ్యోతి ఇటీవల మృతిచెందిన నేపథ్యంలో ఆమె కుమారుడు అరవ మహేష్‌కుమార్‌ను, ఇతర కుటుంబసభ్యులను హంస జిల్లా అధ్యక్షుడు చేజర్ల సుధాకర్‌రావు పరామర్శించారు. శనివారం నెల్లూరు నగరంలోని వాదనాల వారి వీధిలో ఉన్న వారి నివాసానికి ఏపీ హెల్త్ అడ్మినిస్ట్రేషన్, మెడికల్ సర్వీసెస్ అసోసియేషన్ (హంస) జిల్లా అధ్యక్షుడు చేజర్ల సుధాకర్‌రావు వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా డీఎంజే జ్యోతి వైద్యశాఖలో అందించిన సేవలను గుర్తుచేసుకున్నారు. అలాగే అసోసియేషన్ జిల్లా ప్రచార కార్యదర్శి శేషగిరిరావు, గౌరవ సలహాదారు పరిమళ సంతాపం వ్యక్తం చేశారు.

డాక్టర్ లావణ్యకు గోల్డ్ మెడల్



గోల్డ్‌మెడల్, ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న డాక్టర్ లావణ్య

నెల్లూరు(అర్బన్): నెల్లూరు నగరానికి చెందిన ప్రముఖ న్యూరాలజిస్ట్ డాక్టర్ కుంకాల లావణ్య గోల్డ్‌మెడల్ అందుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఆమె శనివారం మాగుంట లేఅవుట్‌లోని ఎనెల్ ఆస్పత్రిలో వెల్లడించారు. చెన్నైలోని శ్రీరామచంద్ర మెడికల్ కళాశాలలో (ఎస్ఆర్ఎం) 2021–2024 మధ్య న్యూరాలజీ సూపర్ స్పెషాలిటీ కోర్సును డాక్టర్ లావణ్య పూర్తి చేశారు. వైద్య విద్యలో రాణించడంతోపాటు న్యూరాలజీ విభాగంలోనూ ఆమె టాపర్‌గా నిలిచారు. దీంతో శుక్రవారం చెన్నైలో జరిగిన స్నాతకోత్సవ సభలో చండీగర్ అమిటి యూనివర్సిటీ వైస్ చాన్సలర్ సెల్వమూర్తి ఆమెను గోల్డ్‌మెడల్‌తో సత్కరించి ప్రశంసాపత్రాన్ని అందజేశారు. ఆమె 2010–15 మధ్య ఎంబీబీఎస్, 2016–19 మధ్య డీఎన్‌బీ (జనరల్ మెడిసిన్), అనంతరం చెన్నై ఎస్ఆర్ఎంలో న్యూరాలజీ విభాగంలో డీఎం కోర్సు పూర్తి చేసి గోల్డ్ మెడల్ అందుకున్నారు. ఆమె భర్త డాక్టర్ నాగేంద్ర ప్రసాద్ కార్డియాలజిస్ట్‌గా సేవలందిస్తున్నారు. తక్కువ ఖర్చుతో పేదలకు వైద్యసేవలందించేలా కృషి చేస్తానని డాక్టర్ లావణ్య తెలిపారు.

చిన్నారులను ఆదరిద్దాం



వియాని హోంలో కేక్ కట్ చేస్తున్న డాక్టర్ ఆదర్శ్ తదితరులు

నెల్లూరు(అర్బన్): పేద విద్యార్థులు, ఇబ్బందుల్లో ఉన్న చిన్నారులను ఆదరించాలని పీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు శాఖవరపు వేణుగోపాల్ అన్నారు. స్థానిక పొదలకూరు రోడ్డులోని వియాని హోంలో శనివారం కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దంత వైద్యనిపుణుడు డాక్టర్ అనుమల ఆదర్శ్ పుట్టిన రోజు సందర్భంగా చిన్నారులకు అన్నదానం చేశారు. అంతకుముందు కేక్ కట్ చేసి, చిన్నారులకు పంచిపెట్టారు. కార్యక్రమంలో పీహెచ్‌పీ గౌరవాధ్యక్షుడు జయప్రకాష్, ప్రధాన కార్యదర్శి గోరంట్ల శేషయ్య, వియాని హోం నిర్వాహకురాలు సిస్టర్ రమ, అన్నపూర్ణ, మ్యాగి, అరవ రామ్మోహన్‌రావు పాల్గొన్నారు.

మెనూ అమలు తప్పనిసరి



బీసీ హాస్టల్లో వంట గదిని పరిశీలిస్తున్న మురళీకృష్ణ యాదవ్

వెంకటాచలం : ప్రభుత్వం ఇచ్చిన మెనూను తప్పనిసరిగా అమలు చేస్తూ, విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు మురళీకృష్ణ యాదవ్ అన్నారు. మండలంలోని గొలగమూడి, ఎర్రగుంట గ్రామాల వద్ద ఉన్న మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ బాల, బాలికల వసతి గృహాలను శనివారం ఆయన సందర్శించారు. వంట గదులు, మధ్యాహ్నం భోజనం ఎలా ఉందో పరిశీలించారు. భోజనం, విద్యాబోధన ఎలా ఉందో విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనంతో పాటుగా, క్రమశిక్షణతో కూడిన విద్యనందించాలని ఉపాధ్యాయులను కోరారు.

భక్తిశ్రద్ధలతో తహలీల్ ఫాతేహా

• నేడు ఖత్ మే జియారత్

నెల్లూరు(బృందావనం): బారాషహీద్ దర్గాలో రొట్టెల పండగ సందర్భంగా శనివారం తహలీల్ ఫాతేహా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ ఖుదావన్ గంధం ప్రత్యేక బిందెలో తీసుకొచ్చారు. ముజావర్లు, ఫకీర్లు, చిన్నబజార్ ఖాజాపీర్ మాలిక్ దర్గా పీఠాధిపతి ఎస్ఏఎం హుస్సేనీ, షేక్ హిదయతుల్లా, గంధ మహోత్సవం కార్యనిర్వాహకులు, మతపెద్ద సయ్యద్ సమీ హుస్సేని ఆధ్వర్యంలో ప్రత్యేక దువా నిర్వహించి తహలీల్ ఫాతేహా నిర్వహించారు. అనంతరం గంధం, ఖర్జూరాలను భక్తులు పంచిపెట్టారు. బారాషహీద్ దర్గా రొట్టెల పండగ కమిటీ చైర్మన్ షేక్ ఖాదర్ బాషా, మతపెద్దలు మాట్లాడుతూ ఆదివారం ఉదయం 10 గంటలకు జరిగే ఖత్ మే జియారత్‌తో రొట్టెల పండగ ముగుస్తుందని తెలిపారు.

కౌలు రైతులను ఆదుకునేందుకు చర్యలు

వెంకటాచలం : కౌలు రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం అన్నిరకాల చర్యలు తీసుకుంటోందని వ్యవసాయశాఖ ఏడీఏ ఎస్.శ్రీనివాసులు అన్నారు. మండలంలోని తిక్కవరప్పాడు, కంటేపల్లి గ్రామాల్లో కౌలు రైతులతో శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కౌలుకు పొలాన్ని సాగు చేసే రైతులు తప్పనిసరిగా సీసీఆర్ కార్డులు తీసుకోవాలని సూచించారు.

సాగు ధ్రువీకరణ పత్రం తప్పనిసరి



వరి పంటను పరిశీలిస్తున్న ఏఓ నాగమోహన్

నెల్లూరు సిటీ: కౌలు సాగుదారులు పంట సాగు ధ్రువీకరణ పత్రం తప్పనిసరిగా తీసుకోవాలని నెల్లూరు రూరల్ మండల వ్యవసాయాధికారి ఎస్వీ నాగమోహన్ సూచించారు. నెల్లూరు రూరల్ మండలంలో దొంతాలి గ్రామంలో కౌలు రైతులకు సాగు ధ్రువీకరణ పత్రాలపై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాగు ధ్రువీకరణ పత్రం తీసుకోవడం ద్వారా పంట నష్టపరిహారం, సాగు ఖర్చులకు ఆర్థికసాయం, విత్తనాలు, ఎరువులు ప్రభుత్వం ద్వారా అందుతాయని తెలిపారు. ప్రతి కౌలు రైతు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం రైతుల వరి పొలాలను సందర్శించి పలు సూచనలిచ్చారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకుడు విజయసారథి, రైతు వెంకయ్యానాయుడు తదితరులు పాల్గొన్నారు.

మగువలకు ప్రత్యేకం 'వన్‌గ్రామ్ గోల్డ్'


• సామాన్యులకు దూరంగా బంగారం ధరలు
• బంగారు తాపడం నగలపై పెరుగుతున్న ఆసక్తి
• రోల్డ్‌గోల్డ్ స్థానంలో వన్‌గ్రామ్ గోల్డ్



బంగారు నగలను తలపిస్తున్న వన్ గ్రామ్ గోల్డ్ హారాలు, చెవి పోగులు



బంగారు చైన్‌లను పోలి ఉన్న వన్ గ్రామ్ గోల్డ్ చైన్‌లు



వన్ గ్రామ్ వడ్డాణం

కొడవలూరు : కొన్నేళ్లుగా బంగారం ధర రోజు రోజుకు పెరుగుతోంది. దీంతో ఆభరణాల కొనుగోలు సామాన్య, మధ్య తరగతి ప్రజలకు తలకు మించిన భారంగా మారింది. ఈ నేపథ్యంలో మేలిమి బంగారం కంటే మిన్నగా కనిపించే వన్‌గ్రామ్ గోల్డ్ ఆభరణాలు అందుబాటులోకి వచ్చాయి. వీటిపై మగువలు బాగా ఆసక్తి కనబరుస్తున్నారు. పండగలు, శుభకార్యాలకు వీటిని ధరిస్తున్నారు. ప్రస్తుతం నెల్లూరు నగరంతో పాటు పట్టణాలు, మండల కేంద్రాల్లో వన్‌గ్రామ్ గోల్డ్ దుకాణాలు ఇబ్బడి ముబ్బడిగా వెలసి వినియోగదారులను ఆకట్టుకొంటున్నాయి.

తేడా గుర్తించడం కష్టమే

మార్కెట్‌లోకి వన్‌గ్రామ్ గోల్డ్ నగలు రాకముందు గిల్టు(రోల్డ్ గోల్డ్) నగలు అందుబాటులో ఉండేవి. బంగారు నగలకు వీటికి చాలా తేడా ఉండేది. ఈ గిల్టు నగలను ఫ్యాషన్‌గా పెట్టుకోవడానికే తప్ప పెళ్లిల్లు వంటి వేడుకలప్పుడు పెట్టుకునేందుకు పెద్దగా ఆసక్తి కనబరిచే వారు కాదు. కానీ ఇప్పుడు ఇత్తడేదో పుత్తడేదో తెలియనంతగా అందమైన రాళ్ల నగిషీలతో మెరిసిపోతూ వన్‌గ్రామ్ నగలు అందుబాటులోకి వచ్చాయి. దీంతో వయస్సు తేడా లేకుండా చిన్నా పెద్దా అందరూ వీటిని ఇష్టంగా ధరిస్తున్నారు. చెవి పోగుల నుంచి కాలపట్టీల వరకు హారాల నుంచి వడ్డాణాల దాకా అచ్చం బంగారం అనిపించేలా ఇవి ఆకట్టుకొంటుండడం గమనార్హం.

రోల్డ్‌గోల్డ్‌కు, వన్‌గ్రామ్‌కు తేడా ఏంటంటే

రోల్డ్‌గోల్డ్‌కు వన్‌గ్రామ్ గోల్డ్ ఆభరణాలకు పెద్దగా తేడా ఉండదు. రోల్డ్‌గోల్డ్ నగలను రాగి, ఇనుము, అల్యూమినియం తదితర వాటితో తయారు చేస్తారు. వీటికి 8 లేక 10 క్యారెట్ల బంగారు పూత వేస్తారు. పది క్యారెట్ల బంగారంలో 41.7 శాతం మాత్రమే బంగారం ఉంటుంది. ఇవి నీళ్ల తడుస్తుంటే త్వరగా నల్లబడిపోతాయి. వన్ గ్రామ్ గోల్డ్ నగలను రాగి లేక వెండితో మాత్రమే తయారు చేస్తారు. వీటిని 22 లేదా 24 క్యారెట్ల బంగారంతో తాపడం చేయడం వల్ల బంగారు ఆభరణాల కంటే ఎక్కువ ఆకర్షణీయంగా కనిపిస్తాయి. ఎక్కువ కాలం రంగు పోకుండా ఉంటాయి.

తయారీ ఎక్కడంటే

వన్‌గ్రామ్ గోల్డ్ నగలు ఎక్కువగా ముంబై, బెంగళూరు, మహారాష్ట్ర, గుజరాత్‌తో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా జిల్లా మచిలీపట్నంలో ప్రాంతాల్లో తయారు చేస్తారు. నెక్లెస్‌లు, వడ్డాణాలు, గాజులు, గొలుసులు, ఉంగరాలు, లాకెట్‌లు, వంకీలు, కాలపట్టీలు, చెవి రింగులు వంటి పలురకాల ఆభరణాలతో పాటు ఆర్డర్లపై ప్రత్యేకంగా కోరిన మోడల్‌నూ తయారు చేసి ఇస్తున్నారు.

ఉపాధి కల్పిస్తున్న వన్‌గ్రామ్ వ్యాపారం

బంగారం తర్వాత అంతటి పేరున్న వన్‌గ్రామ్ గోల్డ్ వ్యాపారులకు ఉపాధి చూపుతోంది. జిల్లా కేంద్రంతో పాటు పట్టణాలు, మండల కేంద్రాల్లో ప్రత్యేకంగా దుకాణాలను ఏర్పాటు చేసి అమ్మకాలు చేస్తున్నారు. ఒక్క నెల్లూరు నగరంలోనే వందకుపైగా దుకాణాలున్నాయంటే వీటికున్న క్రేజ్ ఏమిటో అవగతం చేసుకోవచ్చు. ఈ ఆభరణాలు సైజ్‌ను బట్టి రూ.వంద నుంచి రూ.6 వేలు వరకు అందుబాటులో ఉన్నాయి. చెవి పోగుల్లాంటి చిన్నవైతే బాగా తక్కువ ధరల్లో, వడ్డాణాల్లాంటి పెద్దవైతే ఎక్కువ ధరల్లో లభ్యమవుతున్నాయి.

చోరీ జరిగినా నష్టం లేదన్న ధీమా

ఇటీవల కాలంలో చైన్ స్నాచింగ్‌లు, తాళం వేసిన ఇంట్లో చోరీలు ఎక్కువగా జరుగుతున్నాయి. ఇలాంటి ఘటనలు జరిగినా ఆర్థికంగా నష్టం ఉండదనే ఉద్దేశంతో చాలా మంది ధనిక వర్గాల మహిళలు సైతం వీటిని కొనుగోలు చేస్తున్నారు. వీరు మేలిమి బంగారు నగలను బ్యాంక్ లాకర్‌లో భద్రపరచి వన్‌గ్రామ్ గోల్డ్ ఆభరణాలను ఇంట్లో తెచ్చి పెట్టుకొంటున్నారు. ప్రత్యేకమైన సందర్భాల్లో తప్ప మరెప్పుడూ బంగారు ఆభరణాల జోలికెళ్లడం లేదు. మిగిలిన సమయాల్లో వన్‌గ్రామ్ గోల్డ్‌తోనే కాలం నెట్టుకొస్తున్నారు. వీటికి గ్యారెంటీ కూడా ఇస్తుండడంతో వినియోగదారుల సంఖ్య నానాటికీ పెరుగుతోంది.

దొంగల భయం ఉండదు



ప్రస్తుత పరిస్థితుల్లో బంగారు నగలు ధరించి ఎక్కడికైనా వెళ్లాలంటే భయమేస్తోంది. చైన్ స్నాచర్లు ఆడవాళ్లనే లక్ష్యంగా చేసుకుని మెడలోని దండలను లాక్కెళ్తున్నారు. ఇలాంటి ఘటనలు చోటుచేసుకుంటే మా లాంటి మధ్య తరగతి వాళ్లం ఆర్థికంగా బాగా ఇబ్బంది పడుతాం. వన్‌గ్రామ్ గోల్డ్ నగలు కూడా అసలు నగలనే పోలి ఉంటున్నందున వాటినైతే ఎక్కడికైనా ధైర్యంగా వేసుకుని వెళ్లవచ్చు. చోరీ జరిగినా ఆర్థికంగా పెద్దగా నష్టం ఉండదు. అందువల్ల వన్‌గ్రామ్ నగలనే ఎక్కువగా వినియోగిస్తున్నాం. పైగా నార్తురాజుపాళెంలోనే ఇవి లభ్యమవుతున్నందున నెల్లూరు నగరానికి వెళ్లాల్సిన అవసరం లేదు.

– పానేటి సంధ్యారాణి, నార్తురాజుపాళెం

మాలాంటి వారికి ఊరటే



బంగారం ధరలు ఆకాశాన్నంటుతున్న ప్రస్తుత తరుణంలో మధ్య తరగతి వారు బంగారు ఆభరణాలు ధరించడం కష్టమే. అందువల్లే తక్కువ ధరలోనే అసలు నగలను పోలి ఉండే వన్‌గ్రామ్ గోల్డ్ నగలను వినియోగిస్తున్నాం. తద్వారా నగలు ధరించామన్న అనుభూతి ఉండడంతో పాటు ఆర్థిక భారం తప్పుతుంది. బంగారు నగలు కొనాలంటే అప్పు చేయాల్సిన పరిస్థితి ఉన్నందున వన్‌గ్రామ్ నగలు ఎంతో ఉపకరిస్తున్నాయి. రోల్డ్‌గోల్డ్ నగలనైతే అసలు నగలు కాదని సులువుగా గుర్తిస్తారు. వన్‌గ్రామ్ నగలను ఎట్టి పరిస్థితుల్లోనూ గుర్తించలేరు.

– ఎస్కే మాప్ జాన్, కొడవలూరు

రెడ్‌క్రాస్ సేవలు శ్లాఘనీయం



రెడ్‌క్రాస్ వైద్యశిబిరంలో పాల్గొన్న డాక్టర్ శార్వాణి, వైద్యసిబ్బంది

నెల్లూరు(బారకాసు): బారాషహీద్ దర్గాలో రొట్టెల పండగ సందర్భంగా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం ద్వారా అందిస్తున్న వైద్యసేవలు శ్లాఘనీయమని జిల్లా అంధత్వ నివారణ సంస్థ ప్రోగ్రామ్ మేనేజర్ డాక్టర్ బి.శార్వాణి అన్నారు. శనివారం బారాషహీద్ దర్గాను సందర్శించిన ఆమె మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాలతోపాటు వివిధ రాష్ట్రాల నుంచి రొట్టెల పండగకు విచ్చేసిన భక్తులకు వైద్యసేవలు అందించడంలో రెడ్‌క్రాస్ ముందుందని తెలిపారు. గత నాలుగు రోజులుగా రెడ్‌క్రాస్ వైద్యశిబిరాల్లో 500 మందికిపైగా భక్తులకు వైద్యసేవలు అందించినట్లు తెలిపారు అత్యవసర కేసులను ప్రభుత్వ వైద్యశాలకు తరలించి మెరుగైన వైద్యం అందిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో పీహెచ్‌పీ, ఆర్ఎంపీ జిల్లా నాయకులు, రెడ్‌క్రాస్ వలంటీర్లు, సిబ్బంది పాల్గొన్నారు.